క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండిహారం వితరణ


వెండి హారం అందజేస్తున్న దంపతులు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ఆత్మకూరు మండలం ఆలమూరుకు చెందిన పాటిల్ మల్లికార్జున రెడ్డి, రజిత దంపతులు వెండిహారం వితరణ చేసినట్లు ప్రధాన అర్చకుడు రామాచార్యులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్వామికి రూ.11 వేలు విలువ చేసే వెండిహారం(10.5 తులాలు) అందజేశారన్నారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేసి దంపతులను ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

'ఇసుక తరలిస్తే కఠిన చర్యలు'

గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండ, కల్లూరు, ఇల్లూరు సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా హెచ్చరించారు. ఆదివారం ఎస్ఐ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఘనంగా టిప్పుసుల్తాన్ జయంతి


ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు: టిప్పుసుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లిమీన్ కమిటీ ఆధ్వర్యంలో టిప్పుసుల్తాన్ 274వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిప్పు సుల్తాన్ చిత్రపటం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పోర్టర్స్‌లైన్ దర్గా నుంచి పాత గుంతకల్లులోని మస్తానయ్య దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీఆర్ ఖలీల్, జిల్లా అధ్యక్షుడు ఎంబీ మౌలా, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సిరాజ్, ఇమ్రాన్, కోశాధికారి దాదాపఠాన్, కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు


ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన ఆర్ఆర్ డాన్స్ బృందం

గుత్తి: తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని సరస్వతీ పరిషత్ ఆడిటోరియంలో శనివారం రాత్రి జరిగిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో గుత్తి ఆర్ఆర్ డాన్స్ ఇన్‌స్టిట్యూట్ బృందం కళాకారులు ప్రతిభ చాటారు. అద్భుతంగా డాన్స్ ప్రదర్శన ఇవ్వడంతో గుత్తి ఆర్ఆర్ డాన్స్ బృందం ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించింది. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు రవిని పలువురు పట్టణవాసులు అభినందించారు.

ఘనంగా ఆరాధనోత్సవం


ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా ప్రభాకర్

గుంతకల్లు: గుంతకల్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా మరోసారి దౌల్తాపురం కావలి ప్రభాకర్‌ను ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో మరోసారి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, పార్టీ జిల్లా అధ్యక్షుడు వై.మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను పలువురు అభినందించారు.

ఆక్రమణలో ఆర్అండ్‌బీ స్థలాలు

- బాడుగల రూపంలో కబ్జాదారులకు కాసులపంట
- పట్టించుకోని అధికారులు


ఎద్దులపల్లిరోడ్డుకు ఇరువైపులా ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణకు గురైన దృశ్యం


ఆక్రమణలకు గురైన మంజు టాకీస్ రోడ్డు

పామిడి: పామిడిలో ఆర్అండ్‌బీ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. స్థానిక బీసీసీ రోడ్డు, ఎద్దులపల్లిరోడ్డు, మెయిన్‌బజార్‌రోడ్డు, సుదర్శన్ టాకీస్ రోడ్డు, మంజు టాకీస్ రోడ్డు దురాక్రమణలతో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అలాగే స్థానిక మెయిన్‌బజార్‌లోని ఉరవకొండ మఠం కరిబసప్ప, ఎద్దులపల్లిరోడ్డులోని కోదండరామస్వామి ఆలయ మాన్యం భూములు సైతం అక్రమార్కులు కబ్జాచేశారు. ఉరవకొండ మఠం భవనాల్లో అద్దెకు ఉన్నవారు ఎక్కువ అద్దెకు ఇతరులకు ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా మఠం భవనాల్లో వస్త్ర, ఇతరత్రా వ్యాపారాలు నిర్వహిస్తున్న అద్దెదారులు ఏకంగా అవి వారి సొంతభవనాలే అన్నట్లు మేడలు, మిద్దెలు కట్టేసి కోట్ల రూపాయలు విలువగల వాటిని జాతీయం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. ఇకపోతే కోదండరామస్వామి ఆలయ మాన్యం భూముల ఆక్రమణలతో భవనాలు, కాంప్లెక్స్‌లు నిర్మించుకున్నా దేవదాయశాఖ వారు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. అదేవిధంగా ఆయా ప్రధాన రోడ్లలో రహదారికి ఇరువైపులా 10 నుంచి 30 అడుగుల మేర ఆర్అండ్‌బీ స్థలం దురాక్రమణల పాలైంది. కాలువలపై సైతం అక్రమార్కులు పక్కా భవనాలు నిర్మించి, బాడుగలకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. ప్రస్తుతం పామిడి పంచాయతీ ఈఓ గోపాల్ ఆధ్వర్యంలో ప్రధాన రోడ్లకు గల డ్రైనేజీ కాలువల వరకే ఆక్రమణలు తొలగిస్తున్నారు.

మార్కింగ్ వేశారు.. తొలగించడం మరిచారు..

2021లో ఆర్అండ్‌బీ అధికారుల సూచనల మేరకు అప్పటి మునిసిపల్ కమిషనర్ అనుపమ, తహసీల్దార్ సునీతబాయి ఆధ్వర్యంలో మండల సర్వేయర్ బ్రహ్మానందం సారథ్యంలో మునిసిపల్, గ్రామ సచివాలయాల సర్వేయర్లు, టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు ప్రధాన రోడ్లలో ఆక్రమణలను గుర్తిస్తూ మార్కింగ్ వేశారు. గార్లదిన్నె మండలం కల్లూరు వై జంక్షన్ నుంచి పామిడి వై జంక్షన్ వరకూ వంద అడుగుల మేర రోడ్డు వైడింగ్‌కు ఆర్అండ్‌బీ అధికారులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా కొలతలైతే చేపట్టి మార్కింగ్ వేశారు గానీ అక్రమ కట్టడాలను తొలగించడం మరిచారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రోడ్డు కుంచించుకుపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణల నుంచి ఆర్అంబ్‌బీ స్థలాలు, దేవుడి మాన్యమ భూములు రక్షించాలని పట్టణవాసులు కోరారు.

ప్రమాదాలకు అడ్డుకట్ట



పామిడిలో ఇప్పటికే ఆక్రమణల తొలగింపుతో రోడ్డు నిడివి పెరిగింది. డివైడర్లు ఏర్పాటైతే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ఆక్రమణల వల్ల గుత్తి–అనంతపురం బీసీసీ రోడ్డుపై తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. డివైడర్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యను, రోడ్డు ప్రమాదాలను అధిగమించవచ్చు.

–సీ అనంత సురేష్, పామిడి

రోడ్ల ఆక్రమణలపై రీ సర్వే



2021లో ప్రధాన రోడ్ల ఆక్రమణలపై సర్వే చేయించాం. ప్రస్తుతం మండల సర్వేయర్ మురళీధర్ ఆధ్వర్యంలో ప్రధానరోడ్ల ఆక్రమణలపై రీసర్వే చేపట్టాలని సచివాలయాల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందికి ఆదేశించాం. ఆ నివేదికల ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో రోడ్లు, పెన్నానది ఆక్రమణల తొలగింపు చేపడతాం.

– శ్రీధరమూర్తి, తహసీల్దార్, పామిడి

ప్రొఫెసర్ ఆశయ సాధనకు పాటుపడతాం


ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పీడిత ప్రజల హక్కుల సాధనకై చివరి నిమిషం వరకు పోరాడి అసువులు బాసిన ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాల సాధనకు పాటుపడతామని ఐఎఫ్‌టీయూ (భారత కార్మిక సంఘాల సమాఖ్య) జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, సిటిజన్ ప్రోగ్రెసివ్ ఫోరమ్ కార్యదర్శి తారకేష్ అన్నారు. ఆదివారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సాయిబాబా సంస్మరణ సభను నిర్వహించారు. అతడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ సాయిబాబా చిన్నప్పుడే పోలియోతో రెండు కాళ్లు కోల్పోయినా తల్లి సాయంతో అంగవైకల్యాన్ని అధిగమించి అత్యంత ప్రతిభావంతుడిగా ఎదిగాడన్నారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న ఫాసిస్ట్ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు చేయడం ద్వారానే సాయిబాబాకు నిజమైన నివాళులర్పించిన వారవుతామన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, ఓపీడీఆర్ జిల్లా కార్యదర్శి లాయర్ నాగరాజు, పేదల సంఘం కార్యదర్శి జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌పై వసూళ్ల పర్వాన్ని ఆపాలి


మాట్లాడుతున్న హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్

పామిడి: ఆధార్ కార్డుల అప్‌డేట్‌కు సంబంధించి సచివాలయాల్లో వసూళ్ల పర్వాన్ని ఆపాలని హరిత దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్‌లోని విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు అపార్ నమోదు, ప్రజలకు సంక్షేమ పథకాల వర్తింపుకు సంబంధించి ఆధార్‌కార్డులో వివరాలు సక్రమంగా ఉండాలని ప్రభుత్వ ఆదేశించిందన్నారు. దీంతో విద్యార్థులు, దివ్యాంగుల ఆధార్‌కార్డులు అప్‌డేట్ కావాలంటే వారు తప్పనిసరిగా బర్త్ సర్టిఫికెట్లు పొందుపరచాల్సి ఉందన్నారు. దీన్ని ఆసరా తీసుకున్న సచివాలయాల ఉద్యోగులు బర్త్ సర్టిఫికెట్ల కోసం ప్రజల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి ప్రజలకు న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్, మనోజ్, గోవర్ధన్, రామాంజనేయులు, మణికంఠ, రాజశేఖర్‌యాదవ్, శీను, అంజి పాల్గొన్నారు.

పంచాయతీ కాంప్లెక్స్‌కు వేలం జరిగేనా?



పామిడి: పామిడి గ్రామ పంచాయతీకి 40 ఏళ్ల క్రితం కాంప్లెక్స్ నిర్మించారు. అందులో భాగంగా 20 గదులు నిర్మించారు. మొదట్లో ఈ గదులకు వేలం నిర్వహించి, వేలంలో దక్కించుకున్న వారికి గదులు కేటాయించేవారు. ఈ కాంప్లెక్స్ రోడ్డుకు సమీపంలో ఉండడంతో వ్యాపారాలకు మంచి గిరాకీ ఉండేది. మొదట్లో గదుల అద్దె రూ.వెయ్యి ఉండేది. కాలక్రమేణా పంచాయతీ కాంప్లెక్స్ వ్యాపారానికి కేంద్ర బిందువైంది. దీంతో అప్పటికే ఈ కాంప్లెక్స్‌లో అద్దెకు ఉన్న అద్దెదారులు ఫెవికాల్‌లా అతుక్కుపోయారు. వారు ప్రజాప్రతినిధులు అండదండలతో అధికారులపై ఒత్తిళ్లు తేవడంతో వేలం లేకుండా పోయింది. మూడేళ్ల కొకసారి అద్దె పెంచుతూ వారినే కొనసాగించారు. ఇదే అదునుగా భావించిన అద్దెదారులు, వారికి కేటాయించిన గదులను కొందరు ఇతరులకు తామిచ్చే అద్దెకంటే రెండు రెట్లు అధికంగా అద్దెకు ఇచ్చేశారు. అంతేకాకుండా అద్దె గదులకు ఎదురుగా చిన్న చిన్న షాపుల ఏర్పాటు చేయించి వాటి నుంచి కూడా రూ.వేలలో అద్దె దండుకుంటూ అక్రమంగా ఆర్జిస్తున్నారు. అక్రమార్జనకు అలవాటు పడ్డ అద్దెదారులు ఓ అధికారపార్టీ నేతకు రూ.75 వేల దాకా గుడ్‌విల్ ఇచ్చి తమ గదులు తమకే కేటాయించాలని రాయబారాలు నడుపుతున్నారు.కులాల క్యాటగిరి వైజ్‌గా వారి అభ్యున్నతిని కోరుతూ ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ గదులు ఈసారైనా వేలంకు నోచుకుంటాయో? లేదో? వేచి చూడాలి.

ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీతో పాటు రూరల్ ఏరియాలో ఆదివారం తహసీల్దార్ ఓబులేసు ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది, బీఎల్‌ఓలు ప్రత్యేక నమోదు కేంద్రాల్లో కొత్త ఓటర్లను నమోదు చేయడం, మార్పులు, చేర్పులు చేయడం వంటి ప్రక్రియ నిర్వహించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

యాడికి: మండలంలోని సాగర్ సిమెంట్ కర్మాగారం సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ రమణ ఆదివారం తెలిపారు. ధర్మవరానికి చెందిన నిందితుడు అమర్‌నాథ్‌ను అరెస్టు చేసి, రూ.2వేలు విలువ చేసే కర్ణాటక మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు


బొప్పేపల్లిలో గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

యల్లనూరు: గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ఆదివారం అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు బొప్పేపల్లి, తిమ్మంపల్లి, గొడ్డుమర్రి గ్రామాలను సందర్శించారు. గొడ్డుమర్రి గ్రామంలో ఇటీవల టీడీపీ కార్యకర్తలు యోగానందరెడ్డి, పుల్లయ్య పరస్పర దాడులకు తెగపడిన విషయం తెలిసిందే. ఇరువర్గాలు అట్రాసిటీ కేసులు పెట్టుకోవడంతో గ్రామస్తులు, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ తదితరులతో డీఎస్పీ సమావేశమై మాట్లాడారు. ఫ్యాక్షన్ వదిలి ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీసులకు తెలియజేయాలని, మరోసారి గొడవ పడితే జీవితాంతం జైలుపాలు అవుతారని హెచ్చరించారు. అనంతరం గ్రామ పరిస్థితులపై సీఐ సత్యబాబు, ఎస్ఐ శ్రీరాం ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. తిమ్మంపల్లిలోని పోలీస్ పికెట్‌ను తనిఖీ చేశారు. అనంతరం యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను వెళ్లి పలు రికార్డులు తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై సీఐ, ఎస్ఐను అడిగారు. డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, మట్కా, పేకాట, మద్యం, అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎవరైనా సమస్యలు సృష్టించినా, ప్రోత్సహించినా తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఐకి ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి సీపీఎం ప్రజాపోరు


పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎం నేతలు


కల్లుమడిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

శింగనమల: ప్రజల సమస్యలు తెలుసుకుని , వాటి సాధన కోసం సీపీఎం ప్రజాపోరు యాత్ర చేపట్టం దని, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరంగయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కల్లుమడి, గుమ్మేపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కల్లుమడి నుంచి గుమ్మేపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు విపరీతంగా పెరిగిపోయి, ప్రమాదాలకు దారితీస్తున్నాయని, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డులో మోరీ గుంత పడిందని, దీని వలన ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. శింగనమల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8వ తేది నుంచి 14వ తేదీ వరకు ప్రజా పోరు యాత్ర నిర్వహిస్తున్నామని, 14న తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు రామాంజనేయులు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

బుక్కరాయసముద్రం: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లప్ప మండిపడ్డారు. ఈ నెల 14న మండల కేంద్రంలో నిర్వహించే ప్రజా పోరు ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రంలో పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమాన్ని విస్మరించాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వాల వైఖరికి నిరసనగా ఈ నెల 14న మండల కేంద్రంలో ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, శివారెడ్డి, శ్రీనివాసులు, నాగేంద్ర, నెట్టి కల్లయ్య, పుల్లయ్య, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ.. తాగునీరు వృథా


క్రైస్తవ సమాధుల తోటలో పైప్‌లైన్ లీకేజీ దృశ్యం

పామిడి: పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద క్రైస్తవ సమాధుల తోటలో సత్యసాయి వాటర్ పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. గత కొన్ని నెలలుగా పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పైప్‌లైన్ లీకేజీతో సమాధుల తోటంతా బురదమయమవుతోందని, తద్వారా మృతదేహాలను పూడ్చనికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని క్రైస్తవులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు తక్షణం స్పందించి నీటి వృథాను అరికట్టి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

శింగనమల చెరువులో కార్తీక దీపోత్సవం


శింగనమల చెరువులో దీపాలు వదులుతున్న మహిళలు


చిన్నపప్పూరులోని అశ్వర్థంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

శింగనమల: కార్తీక మాసం నవమిని పురస్కరించుకుని మహిళలు ఆదివారం శింగనమల చెరువులో కార్తీక దీపోత్సవం చేశారు. గంగమ్మకు పూజలు నిర్వహించి, చెరువులో కార్తీక దీపాలను వదిలారు. ఈకార్యక్రమంలో అనంతపురం, శింగనమలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో ఉన్న ముసలమ్మ తల్లి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ముసలమ్మ తల్లి, మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయంలో దీపాలు పెట్టి అర్చనలు అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

అశ్వర్థంలో భక్తజన సందోహం

పెద్దపప్పూరు: కార్తీక మాసం రెండో ఆదివారం సందర్భంగా మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపాన వెలసిన అశ్వర్థ నారాయణుడి క్షేత్రానికి ఆదివారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. నారాయణస్వామి, సింగరబట్టు, గణపతి, ఆంజనేయ, శ్రీకృష్ణార్జునులు, సీతారాములు, నవగ్రహాలతో పాటు శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామికి ముడుపులు, కానుకలతో పాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బాలసుబ్రమణ్య శర్మ, సునీల్ కుమార్ శర్మ, భక్తులు పాల్గొన్నారు. కాగా అశ్వర్థ క్షేత్రంలో టెంకాయల విక్రయ హక్కుదారుడు ఒక్కొక్కటి రూ.30కు విక్రయించాల్సి ఉండగా రూ.40కు విక్రయిస్తుండడంపై భక్తులు మండి పడ్డారు. ఇదే విషయమై ఈఓ సుబ్రమణ్యంను 'సాక్షి' ఫోన్‌లో ప్రస్తావించగా ఇదివరకే వారిని హెచ్చరించామని, ఇకపై టెంకాయలు అధిక ధరలకు విక్రయిస్తే టెండర్ హక్కును రద్దు చేస్తామన్నారు.

సమస్యలుంటే అర్జీలివ్వండి

యల్లనూరు: ప్రజలకు ఏమైనా సమస్యలుంటే తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగంలో అర్జీలు ఇవ్వాలని ఇన్‌చార్జి తహసీల్దారు శేషారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

బదిలీ ఈఓకు సన్మానం


ఈఓ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పామిడి: పామిడి పంచాయతీ ఈఓ చంద్రశేఖర్‌ను ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతపురంలోని ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అబ్దుల్‌రజాక్, అబుసాలెహా, బోయ రమణ, నీలకంఠారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శివారెడ్డి, సర్పంచ్ పెమ్మక చంద్రశేఖర్‌రెడ్డి, పుంజా నాగేష్‌యాదవ్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాబాల్లో మద్యం సేవిస్తే చర్యలు


ధాబా నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

పెద్దవడుగూరు: ధాబాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ధాబా నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లు నిర్వహించినా, మద్యం సేవించే సదుపాయాలు కల్పించినా, విక్రయించినా ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలి


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కరాటేతో స్వీయరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని కసాపురం ఎస్ఐ వెంకటస్వామి సూచించారు. ఆదివారం స్థానిక కసాపురం రోడ్డు సమీపంలోని రామలింగ కాంప్లెక్స్ వద్ద ఉన్న గోజు అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్‌తో కలసి ఎస్ఐ మాట్లాడారు. రోజురోజుకూ అఘాయిత్యాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

జూదరుల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని కుంటలో పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో ఆదివారం సాయంత్రం ఎస్ఐ రమణ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి: మండలంలోని రజాపురం గ్రామ సమీపంలో శనివారం రాత్రి బైక్ అదుపు తప్పి మురళి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బళ్లారికి చెందిన మురళి బైక్‌లో గుత్తికి వస్తుండగా మార్గమధ్యంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన అతడిని 108లో గుత్తి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220732, 9912220722,
9010588846, 9010223701